సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



నేత్రపర్వంగా తిరువీధి సేవ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా చినవెంకన్న ఉభయ దేవేరులు, గోదాదేవితో తిరువీధి సేవ నేత్రపర్వంగా సాగింది.



లక్ష్మీగణపతి హోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.



ఇళ్లకు శోభ.. వారికి ఉపాధి

రాజస్తాన్‌కు చెందిన 300కు పైగా కుటుంబాల వారు బొమ్మల తయారీని వృత్తిగా చేసుకొని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జీవనం సాగిస్తున్నారు. IIలో ▸

న్యూస్‌రీల్

రైతు ప్రయోజనాలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం: రైతు ప్రయోజనాలకు అధికారులు అధిక ప్రాధాన్యమివ్వాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సార్వా సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు, రైసు మిల్లుల నుంచి రైతు భరోసా కేంద్రాలకు పంపాల్సిన గోనె సంచులపై అధికారులతో సమీక్షించారు. ఆచంట, పాలకొల్లు, పెనుమంట్ర, పోడూరు, యలమంచిలి మండలాల్లో ధాన్యం అధికంగా వస్తున్నందున ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సార్వా పంట ధాన్యం దిగుబడి 4.21 లక్షల టన్నులని అంచనా కాగా 261 ఆర్‌బీకేల ద్వారా ఇప్పటివరకు 3.62 లక్షల టన్నులు కొనుగోలు చేశామన్నారు. మూడు, నాలుగు రోజుల్లోనే ధాన్యం సొమ్ములు రైతులకు చెల్లిస్తున్నట్టు చెప్పారు. సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డీఎస్‌ఓ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి పోటీలు

మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం జనవరి 10 నుంచి ప్రారంభం కానుందని, విజయవంతం చేయాలని జేసీ ఆదేశించారు. జిల్లా, నియోజకవర్గాల స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. 23 వరకు మండల స్థాయిలో ఆటలు పోటీలు జరుగుతాయన్నారు.

బాలోత్సవంతో సృజనాత్మకత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

భీమవరం: బాలల సాహిత్యం, కళలు, చరిత్ర తెలుసుకునేందుకు అవగాహన, ఆసక్తి, ఆలోచన, నైపుణ్యం సృజనాత్మకతను కలిగించేలా బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో బాలోత్సవం ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ బాలోత్సవాల ద్వారా బాలల్లో ప్రతిభ పెంపొందించవచ్చన్నారు. డీఈఓ ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ యూటీఎఫ్, అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం, వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం బాలల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హేలాపురి బాలోత్సవం కార్యనిర్వాహక కార్యదర్శి జీవీఎల్ నర్సింహరావు, డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు ఎవరూ భీమవరం కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు. జిల్లా ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్‌టీఐ హెల్ప్‌డెస్క్ ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని రైల్వే జంక్షన్ రోడ్డులో అసోసియేషన్ ఫర్ లీగల్ అండ్ సోషల్ అవేర్‌నెస్ (ఆల్సా) ఆర్‌టీఐ కన్స్యూమర్ హెల్ప్ డెస్క్‌ను కన్స్యూమర్ కమిషన్ జిల్లా అధ్యక్షుడు డి.కోదండ రామమూర్తి, ఎస్.సురేష్ కుమార్ శనివారం ప్రారంభించారు. చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. హెల్ప్‌డెస్క్ అండ్ ఆల్సా ప్రెసిడెంట్ బొమ్మిడి సన్నిరాజ్ మాట్లాడుతూ ఆర్‌టీఐ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి హెల్ప్‌డెస్క్‌లు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొమ్మిడి నారాయణరావు, ఆల్సా జనరల్ బాడీ మెంబర్స్ కంజిత లక్ష్మి, విశాలాక్షి, శ్రావణి, ఎస్వై రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికి నవశకం

- నవశకం పేరిట ఐదు పథకాల అమలు
- నాలుగున్నరేళ్లలో రూ.532 కోట్ల జమ
- నాలుగో విడత చేయూతకు సన్నాహాలు
- జిల్లాలో 74,274 మంది అర్హత

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రభుత్వం నవశకం పేరిట ఐదు పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీకి కట్టుబడి రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. నవశకం కార్యక్రమంలో వైఎస్సార్ కాపు నేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ చేయూత, ఈబీసీ నేస్తం, ఇంటికే రేషన్ బియ్యం పంపిణీ పథకాలకు శ్రీకారం చుట్టి పటిష్టంగా అమలుచేస్తున్నారు. పథకాల లబ్ధితో మహిళలు జీవనోపాధికి బాటలు వేసుకుంటున్నారు. ఇలా నవశకం.. పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.



నాలుగున్నరేళ్లలో.. జిల్లాలో నవశకంలో వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, జగనన్న చేదోడు పథకాల కోసం నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం రూ.532.71 కోట్లు వెచ్చించింది. అలాగే ఇంటికే బియ్యం పంపిణీ వాహనాల కోసం రూ.13.50 కోట్లు ఖర్చు చేసింది.

'కాపు'కాసేలా..

కాపు సామాజిక వర్గానికి చెందిన పేద మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇప్పటివరకూ నాలుగు విడతల్లో రూ.60 వేల ఆర్థిక సాయం అందించారు. జిల్లాలో 2020–21లో 24,199 మందికి రూ.36.29 కోట్లు, 2021–22లో 21,815 మందికి రూ.32.71 కోట్లు, 2022–23లో 31,361 మందికి రూ.47.04 కోట్లు, 2023–24లో 34,642 మందికి రూ.51.96 కోట్లు అందజేశారు.

'చేదోడు'వాదోడుగా..

రజక, నాయీబ్రాహ్మణ, టైలర్ వృత్తి చేసుకునే వారికి జగనన్న చేదోడు పథకం కింద ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేలు అందిస్తోంది. ఇప్పటివరకు నాలుగు విడతలుగా రూ.40 వేల చొప్పున అందించింది. 2020–21లో 10,007 మందికి రూ.10 కోట్లు, 2021–22లో 9,056 మందికి రూ.9.05 కోట్లు, 2022–23లో 10,348కి రూ.10.34 కోట్లు, 2023–24లో 9,698 మందికి రూ.9.69 కోట్లను లబ్ధిదారుల ఖాతాలకు జమచేసింది.

ఇంటికే రేషన్ బియ్యం

ఇంటికే రేషన్ సరుకులు అందించే విప్లవాత్మక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో 239 రేషన్ వాహనాల ద్వారా ప్రతినెలా రేషన్ సరుకులను లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందిస్తోంది. రూ.5.81 లక్షల విలువైన వాహనాన్ని నిరుద్యోగ యువతకు రాయితీపై అందించి వారికి ఉపాధి చూపింది. బీసీ కార్పొరేషన్ ద్వారా 160 వాహనాలకు రూ.9.36 కోట్లు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 79 వాహనాలకు రూ.4.13 కోట్లు మొత్తంగా 239 వాహనాలకు ప్రభుత్వం రూ.13.50 కోట్లు ఖర్చు చేసింది.

విజయవంతంగా అమలు



నవశకంలోని నాలుగు సంక్షేమ పథకాలను బీసీ కార్పొరేషన్ ద్వారా విజయవంతంగా అమలు చేస్తున్నాం. పథకాలకు సంబంధించి మూడు నుంచి నాలుగు విడతల సాయం అందించాం. బీసీ, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు రేషన్ వాహనాలు మంజూరు చేశాం. చేయూత నాలుగో విడత సాయం అందించేందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలో నిధులు జమచేస్తాం.

– ఎస్.పుష్పలత, బీసీ కార్పొరేషన్ ఈడీ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

ఈబీసీలకు వరం

అగ్రవర్ణ పేద మహిళలకు ఈబీసీ నేస్తం కింద ప్రభుత్వం ఏడాదికి రూ.15 వేల చొప్పున రెండు విడతలు అందించింది. 2021–22లో 11,997 మందికి రూ.17.99 కోట్లు, 2022–23లో 13,460 మందికి రూ.20.19 కోట్లు అందజేశారు. 2023–24కు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.

చేయూత.. ఉపాధికి బాట

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున అందిస్తున్నారు. ఇప్పటివరకు మూడు విడతల సాయం అందించారు. 2024 జనవరి లేదా ఫిబ్రవరిలో నాలుగో విడత సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మూడు విడతల్లో మొత్తంగా రూ.56,250 చొప్పున లబ్ధిదారుల ఖాతాలకు జమచేశారు. జిల్లాలో 2020–21లో 51,516 మందికి రూ.96.59 కోట్లు, 2021–22లో 51 వేల మందికి రూ.95.62 కోట్లు, 2022–23లో 70,212 మందికి రూ.131.14 కోట్లు అందజేశారు. నాలుగో విడత సాయానికి 74,274 మంది అర్హత సాధించగా వీరికి రూ.139.26 కోట్లు అందించనున్నారు.

ఎన్నికల సన్నద్ధతలో అప్రమత్తం

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల సన్నద్ధత, నిర్వహణలో ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని, పారదర్శకత, జవాబుదారీతనం ముఖ్యమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ఈఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారానికి ఎన్నికల సంఘం గడువును జనవరి 12 వరకు పొడిగించిందన్నారు. జనవరి 22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. బీఎల్‌ఓలు మరోసారి చేర్పులు, తొలగింపులను తనిఖీ చేసి తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు.

పండగలా పథకాల పంపిణీ : వచ్చే జనవరి, ఫిబ్రవరి నెలల్లో పింఛన్ల పంపిణీ, వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల లబ్ధిని లబ్ధిదారులకు అందించే కార్యక్రమాలను పండగలా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జనవరి నుంచి పెంచిన పింఛన్ మొత్తం లబ్ధిదారులకు అందిస్తామని, ఈ కార్యక్రమాన్ని 3న సీఎం జగన్ కాకినాడ నుంచి ప్రారంభిస్తారన్నారు. ప్రతి నెలా 1వ తేదీన అందించే పింఛన్ 3వ తేదీ తర్వాత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారంగా అందుతుందని, వలంటీర్లు పింఛన్‌దారులకు తెలియజేయాలన్నారు. వచ్చేనెల 22న వైఎస్సార్ ఆసరా, ఫిబ్రవరి 5న చేయూత పథకాలు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమాలను ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో నిర్వహించాలన్నారు. ఆర్డీఓలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత్ అంబరీష్, కె.చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్ మాధుర్, ఈఆర్వోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలూ.. సమ్మె విరమించండి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ విజ్ఞప్తి

తాడేపల్లిగూడెం అర్బన్: పసిపిల్లలు, బాలింతలు, గర్భిణుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సమ్మె విరమించి విధుల్లో చేరాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అంగన్‌వాడీలను విజ్ఞప్తి చేశారు. నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మంత్రి కొట్టు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు దుర్మార్గ పాలనతో అంగన్‌వాడీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ అంగన్‌వాడీలకు చేసిన మేలును సమగ్రంగా వివరించారు. ఇప్పటికే ప్రభుత్వం పలు సమస్యలను పరిష్కరిస్తూ జీఓలు జారీ చేసిందని, మిగిలిన కొన్ని సమస్యల పరిష్కారం కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందన్నారు. అంగన్‌వాడీల సమస్యలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఉదార స్వభావంతో పరిష్కరిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం జగన్ సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. బాలింతలు, గర్భిణులు, పిల్లల కోసం వేల కోట్లు ఖర్చు చేసి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పోషకాహారాన్ని అందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లను సీఎం జగన్‌తో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



సమ్మె విరమించాలని కోరుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

ఎవరి ఉచ్చులో పడొద్దు

అంగన్‌వాడీలు ఎవరి ఉచ్చులోనూ పడవద్దని మంత్రి కొట్టు హితవు పలికారు. వ్యవహారాన్ని తెగే వరకూ లాగవద్దని, వేతనాలు పెంచితేనే సమ్మె విరమిస్తామని మంకుపట్టు పట్టవద్దని అంగన్‌వాడీలకు సూచించారు. సమ్మె కారణంగా బాలింతలు, గర్భిణులు, పిల్లలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. దయచేసి పిల్లల ఉసురు పోసుకోవద్దన్నారు. పరిస్థితిని అర్థం చేసుకుని అంగన్‌వాడీలు వెంటనే సమ్మె విరమించాలని మంత్రి కొట్టు సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

గృహనిర్మాణాలు వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పేదల గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలో గృహనిర్మాణాల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారికి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలన్నారు. అప్పటికీ లబ్ధిదారులు చొరవ చూపకపోతే అర్హత కలిగి నిర్మాణాలకు సిద్ధంగా ఉన్న లబ్ధిదారులకు అవకాశం కల్పించాలన్నారు.

అందుబాటులో సర్వే రికార్డులు : జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా రెండు విడతల్లో 70 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, ఈ మేరకు రికార్డులన్నీ అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఎటువంటి ఫీజు లేకుండా జాయింట్ ఎల్‌పీఎంను వేరుచేసి ప్రత్యేక ఎల్‌పీఎంగా ఇస్తామన్నారు. క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లను ఎటువంటి ఆటంకాలు ఉండవన్నారు. ఎల్‌పీఎంలను విడగొట్టడం, రిజిస్ట్రేషన్ సమస్యలు ఉంటే గ్రామ సచివాలయంలో సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి సానుకూలం

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ అంగన్‌వాడీలు వస్తారన్న సమాచారం మేరకు ఉదయం 9.40 గంటల వరకు ఇక్కడే ఉన్నానని.. పాలకొల్లులో ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లాలని చెప్పారు. అయినా అంగన్‌వాడీలంతా తన కార్యాలయం వద్ద ఉన్నారని తెలుసుకుని సగంలోనే నిలిపి వచ్చినన్నారు. అంగన్‌వాడీల వినతిపత్రంపై భీమవరం వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని, సమస్యల పరిష్కారానికి ఆయన సిద్ధం ఉన్నారన్నారు. ప్రభుత్వం తరఫు నాయకులు, అంగన్‌వాడీ నాయకుల చర్చల్లో మిగిలినవి కూడా పరిష్కారమవుతాయన్నారు.



తణుకులో అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

టీడీపీ హయాంలో గుర్రాలతో తొక్కించారు

అంగన్‌వాడీలంతా ఒక్క విషయం గుర్తుంచుకోవాలని మీకు ఏమైనా మంచి చేయాలంటే సీఎం జగన్ ఒక్కరే చేయగలరని, గత టీడీపీ హయాంలో చంద్రబాబు అంగన్‌వాడీ కార్యకర్తలను గుర్రాలతో తొక్కించడం, పోలీసులతో దాడి చేయించడం వంటివి మరువవద్దని మంత్రి కారుమూరి గుర్తుచేశారు. సీఎం జగన్ మనసున్న వ్యక్తి అని ఆర్థికపరంగా పరిస్థితులను చూసుకుని ఏమాత్రం అవకాశం ఉన్నా అడిగినవన్నీ చేస్తారన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలోనే అంగన్‌వాడీలకు వేతనాలు పెంచారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి తెలుగు యువత నాయకులు

పెనుగొండ: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు పదవి చేపట్టనున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు మండల తెలుగు యువత నాయకుడు గొల్ల రవిని తూర్పుపాలెంలో శనివారం వైఎస్సార్ సీపీ పార్టీ కండువా కప్పి ఆయన ఆహ్వానించారు. ప్రతిపక్షాలు ఎంతమంది కూటమిగా వచ్చినా ప్రజామద్దతు సీఎం జగన్‌కే ఉందని శ్రీరంగనాథరాజు అన్నారు. సంక్షేమానికి దిక్సూచిగా మారి పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. చంద్రబాబును ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పోడూరు మండల కన్వీనర్ పిల్లి నాగన్న, జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, విద్యా మౌలిక సదుపాయాల కల్పన కార్పొరేషన్ డైరెక్టర్ వేణుమాధవరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు నల్లిమిల్లి గోపీ, రుద్రరాజు శివాజీరాజు, దంపనబోయిన బాబూరావు, దిద్దే శ్రీను



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో పార్టీలో చేరుతున్న తెలుగు యువత నాయకుడు



కైకలూరులో టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు ఆసానిఖాన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు తెలుగు యువత అధ్యక్షుడు చేరిక

కైకలూరు: సీఎం జగన్ ప్రజారంజక పాలనకు ఆకర్షితులవుతూ పలువురు టీడీపీ, జనసేన పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారు. కైకలూరు మండల తెలుగు యువత అధ్యక్షుడు ఆసానిఖాన్, జిల్లా ముస్లిం మైనార్టీ విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ ఆధ్వర్యంలో కలిదిండిలో ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే డీఎన్నార్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తానని ఆసానిఖాన్ అన్నారు. కార్యక్రమంలో కైకలూరు ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ అబ్దుల్ హమీద్, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ముస్లిం మైనార్టీ విభాగ కమిటీ జాయింట్ సెక్రటరీ షేక్ మూసా, నాయకులు ఎస్‌డీ బాషా, నయీం, అలీం పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్యనారాయణకు నంది అవార్డు



పోసాని నుంచి నంది అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

పాలకొల్లు సెంట్రల్: గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో బాలల నాటక విభాగానికి న్యాయనిర్ణేతగా వ్యవహరించిన పట్టణానికి చెందిన మానాపురం సత్యనారాయణకు నంది అవార్డు లభించింది. రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి చేతులమీదుగా తాను ఈ అవార్డు అందుకున్నట్లు సత్యనారాయణ శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. సత్యనారాయణను పట్టణ కళాపరిషత్ సభ్యులు కేవీ కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాసరావు, డాక్టర్ కేఎస్‌పీఎన్ వర్మ, వితాకుల వెంకటరమణ, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, ఫీర్ సాహెబ్, నడపన శ్రీనివాసరావు, సోమంచి శ్రీనివాసశాస్త్రి, కొల్లి కొండ ప్రసాద్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో శ్రీనివాసరావు మృతదేహం

వీరవాసరం : రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రమేష్ శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరంలో ఉపాధి నిమిత్తం ఉంటున్న పాటి వెంకట శ్రీనివాసరావు తన స్వగ్రామం కంతేరుకు బైక్‌పై వెళుతుండగా వీరవాసరం మండలం పంజవేమవరం వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను గొయ్యిని తప్పించే క్రమంలో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం తరలించి, మృతుడు భార్య పార్వతీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బొబ్బనపల్లిలో చోరీ

బొబ్బనపల్లిలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని కుక్కల శ్రీనివాసరావు భార్య శుక్రవారం పుట్టింటికి వెళ్లింది. శ్రీనివాసరావు ఇంటికి తాళం వేసి వేరే ఇంట్లో నిద్రించాడు. అయితే శుక్రవారం రాత్రి ఇంటి తాళాలు బద్దలుకొట్టి ఇంట్లో ఉన్న మూడు కాసుల బంగారం, అర తులం ఉంగరం అపహరించారు. ఈ మేరకు బాధితుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇళ్లకు శోభ.. వారికి ఉపాధి

కుబేరుడు.. గౌతమ బుద్ధుడు.. గోపిక.. గోపాలుడు.. రాధాకృష్ణులు.. రామచిలుకలు.. లక్ష్మీదేవి.. సరస్వతీదేవి.. బొమ్మ ఏదైనా వారి హస్తకళా నైపుణ్యం అబ్బురపరుస్తుంది. **అతి తక్కువ వ్యయంతో ఇంటికి శోభనిస్తుంది. వైట్‌సెమ్ ముద్దకు రూపును కూర్చి.. రంగులు అద్ది.. అందమైన అలంకరణ బొమ్మలను అలవోకగా రూపొందిస్తూ.. వాటికి జీవం పోస్తున్నారు రాజస్తాన్‌కు చెందిన కళాకారులు. వాటిని విక్రయించడం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు.**

- వైట్‌సెమ్‌తో కళారూపాల తయారీ
- ఆకట్టుకుంటున్న రాజస్తానీయుల కళానైపుణ్యం
- చవితికి ముందు గణేష్ ప్రతిమలు, తర్వాత కళాకృతుల తయారీతో ఉపాధి
- రూ.50 నుంచి రూ.1200 వరకు ధర
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఉపాధి పొందుతున్న 300కు పైగా రాజస్తానీ కుటుంబాలు

సండే స్పెషల్

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్ : రాజస్తాన్‌కు చెందిన 300కు పైగా కుటుంబాల వారు బొమ్మల తయారీని వృత్తిగా చేసుకొని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జీవనం సాగిస్తున్నారు. ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, అత్తిలి, కవిటం తదితర ప్రాంతాల్లో నివసిస్తూ రోడ్లపక్కన శిబిరాలు ఏర్పాటుచేసుకుని ఇంటిల్లిపాదీ బొమ్మల తయారీలో నిమగ్నమవుతున్నారు. వినాయక చవితి వేడుకల కోసం గణనాథుని విగ్రహాల తయారీకి వీరు అధిక ప్రాధాన్యమిస్తారు. చవితి వేడుకలకు ఆరు నెలల ముందు నుంచే విగ్రహాల తయారీ మొదలు పెడతారు. ఒక అడుగు నుంచి 15 అడుగుల వరకు విగ్రహం తయారీకి మూడు నుంచి వారం రోజుల సమయం పడుతుంది. విగ్రహం సైజు, డిజైన్‌ను బట్టి రూ.3000 నుంచి రూ.50 వేలు వరకు ధర పలుకుతుంది.

షోకేస్ బొమ్మలకు ఆదరణ...

వినాయక చవితి వేడుకలు ముగిశాక ఉపాధి కోసం .. ఇళ్లకు శోభను తెచ్చే అలంకరణ బొమ్మలను తయారుచేస్తుంటారు. రాధాకృష్ణులు, రామచిలుకలు, గోపికలు, గౌతమ బుద్ధుడు, దేవతామూర్తులు, కుబేరుడు, పూలకుండీలు, సైనికులు, అడవి జంతువులు, పక్షులు తదితర బొమ్మలను అరడుగు ఎత్తు నుంచి మూడు అడుగుల ఎత్తు వరకు తయారుచేస్తుంటారు. ఉత్సవాలు, జాతర్లలోను, రద్దీ రోడ్లలో రోడ్ల పక్కన, తోపుడు బండ్లపై ఇంటింటికీ తిరుగుతూ వీటిని విక్రయించి ఉపాధి పొందుతున్నారు. వీటికి ప్రజల నుంచి కూడా విశేష ఆదరణ ఉంది. రంగు రంగుల్లో రూపొందించిన ఈ బొమ్మల కొలువులు చూపరులకు కనువిందు చేస్తుంటాయి. దారిన వెళ్లే ప్రయాణికులు ఆగి తమకు నచ్చిన బొమ్మలను కొనుగోలు చేస్తుంటారు. బొమ్మను బట్టి రూ.50 నుంచి రూ.1200 వరకు ధర పలుకుతాయి. ఈ అలంకరణ బొమ్మల విక్రయం ద్వారా ఖర్చులు పోగా ఒక్కో బొమ్మకు రూ.10 నుంచి రూ.100 వరకు మిగులుతుందని కళాకారులు తెలిపారు.





విక్రయించేందుకు రోడ్డు పక్కన ఉంచిన బొమ్మలు

బొమ్మల తయారీ ఇలా...

వైట్‌సెమ్ మిశ్రమాన్ని పేస్టుగా తయారు చేస్తారు. ఆయా రకాల ఆకృతుల్లో ముందే సిద్ధం చేసి ఉంచిన రబ్బరు ఫ్రేముల్లో ఈ మిశ్రమాన్ని పోస్తారు. కొద్దిసేపటి తర్వాత వాటికున్న రబ్బరు ఫ్రేములను తొలగించి బొమ్మలను ఎండలో ఆరబెడతారు. అవి గట్టిపడిన తర్వాత బొమ్మను బట్టి వాటికి రంగులు అద్దుతారు. ఈ రకంగా పర్యావరణానికి హాని కలగని రీతిలో ప్రభుత్వ నిబంధనల మేరకు పలు జాగ్రత్తలను తీసుకుంటున్నట్టు కళాకారులు చెబుతున్నారు. బొమ్మలకు వేసే ఫ్లోరసెంట్, రేడియం రంగులను పూర్తిగా నిషేధించడంతో సహజమైన అద్దకపు రంగులు వినియోగిస్తున్నామని చెప్పారు. దీని వల్ల కాలుష్యం ఉండదని వారంటున్నారు. ఈ కళారూపాల తయారీ తమకు వారసత్వంగా వస్తోందని, తమ పూర్వీకులు మట్టితో బొమ్మలు తయారు చేసేవారని, మారుతున్న కాలానికి అనుగుణంగా వైట్ సిమెంట్‌తో బొమ్మలు తయారుచేయడం అధికమైందని చెప్పారు. తమ రాష్ట్రానికి చెందిన వందల కుటుంబాలు ఎన్నో ఏళ్ల క్రితమే ఆంధ్రాకు వలస వచ్చి బొమ్మల తయారీ చేస్తున్నాయని, రాజస్తాన్‌లోని పాలీ జిల్లాకు చెందిన కళాకారుడు కిషన్ తెలిపాడు.



కుబేరుడు



రామచిలుకలు



గౌతమ బుద్ధుడు



గోపిక

కోవిడ్ కష్టకాలంలో బొమ్మలే దారి చూపాయి

అధిక సంఖ్యలో వినాయక విగ్రహాల తయారీకి వీరు అప్పులు చేసి పెట్టుబడులు పెడుతుంటారు. కరోనా మహమ్మారితో రెండేళ్ల పాటు గణేష్ ఉత్సవాలు జరగకపోవడంతో విగ్రహాలు అమ్ముడుపోక చాలా ఇబ్బంది పడ్డామని కళాకారులు తెలిపారు. ఆ సమయంలో షోకేస్ బొమ్మలను తయారు చేసి ఇంటింటికీ తిరిగి అమ్మకాలు చేయడం ద్వారా ఉపాధి పొందేవారమని వివరించారు. గత ఏడాది నుంచి వినాయక ప్రతిమల అమ్మకాలు పెరిగినట్టు తెలిపారు.





ఉత్సవాల్లో విక్రయించేందుకు రిక్షాలపై బొమ్మలు తీసుకువెళుతున్న కళాకారులు, రంగులు అద్దేందుకు ఆరబెట్టిన బొమ్మలు

బొమ్మల తయారీనే వృత్తి



రాజస్తాన్‌కు చెందిన మా కుటుంబం చాలాకాలం క్రితం భీమవరం ప్రాంతానికి వలస వచ్చింది. చిన్నతనం నుంచి బొమ్మల తయారీ మా వృత్తి. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఎన్నో వందల కుటుంబాల వారు వినాయక విగ్రహాలు, షోకేస్ బొమ్మల తయారీతో ఉపాధి పొందుతున్నాం.

ముఖేష్, హస్త కళాకారుడు, రాజస్తానీయుడు

అపర భగీరథుడు సీఎం జగన్

- పాలకొల్లుకు శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారం
- రూ.15 కోట్లతో తాగునీటి ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి కారుమూరి, చీఫ్ విప్ ప్రసాదరాజు, గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ప్రజల మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి అపర భగీరథుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పాలకొల్లు పట్టణంలో 11 లక్షల లీటర్ల సామర్థ్యంతో రూ.15 కోట్లతో నిర్మించిన మంచినీటి ప్రాజెక్టును శనివారం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మంత్రి కారుమూరి సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టు ప్రారంభం కావడంతో పాలకొల్లు ప్రజలకు మరో 30 ఏళ్ల వరకు మంచినీటి సమస్య ఉండదన్నారు. దీనికి అనుసంధానంతో బెత్లహాంపేట, హౌసింగ్‌బోర్డు కాలనీలో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించినట్లు మంత్రి వివరించారు.



పాలకొల్లు బెత్లహాంపేటలో వాటర్ ట్యాంక్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కారుమూరి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపి

పాలకొల్లులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడాల గోపిని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. పాలకొల్లు – దొడ్డిపట్ల రోడ్డులో యాళ్లవానిగరువు వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని మంత్రి కారుమూరి, ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు ప్రారంభించారు. అనంతరం గుడాల శ్రీహరి గోపాలరావుకు మంత్రి కారుమూరి, చీఫ్ విప్ ప్రసాదరాజు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కారుమూరి గుడాల గోపిని శాలువాతో సత్కరించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజుల నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, పార్టీ కన్వీనర్లు చంద్రక సత్తిబాబు, విప్పర్తి ప్రభాకరరావు, ఎం.మైఖేల్‌రాజు, గవర, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు పెదపాటి పెద్దిరాజు, బొడ్డేటి సూర్యనారాయణ, మునిసిపల్ కమిషనర్ శేషాద్రి, , మునిసిపల్ డీఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా వేడుకలు నిర్వహించుకోవాలి

ఎస్పీ రవిప్రకాష్



భీమవరం: నిబంధనలకు అనుగుణంగా కొత్త సంవత్సరం వేడుకలు నిర్వహించుకోవాలని ఎస్పీ యు.రవిప్రకాష్ సూచించారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటనల విడుదల చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున వేడుకలు నిర్వహించుకునే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. వేడుకలు నిర్వహించేవారు సబ్ డివిజన్ పోలీసు అధికారుల నుంచి ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని, అర్ధరాత్రి 1 గంటలోపే వేడుకలు ముగించాలని స్పష్టం చేశారు. ప్రధాన రహదారులు, పబ్లిక్ స్థలాల్లో వేడుకల నిర్వహణకు అనుమతి లేదన్నారు. అలాగే వేడుకల్లో బాణసంచా కాల్చడం నిషేధించామని, మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో యువత వాహనాలు నడిపి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపేవారిపై మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. మద్యం దుకాణాలు, బార్‌లను నిర్దేశించిన సమయంలోగా మూసివేయాలన్నారు. యువత గుంపుగా రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని ఎస్పీ కోరారు.

మద్ది అంజన్న సేవలో జడ్జిలు



మద్ది అంజన్నను దర్శించుకున్న జడ్జిలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానాన్ని శనివారం పలువురు జడ్జిలు దర్శించుకున్నారు. ఏలూరు రెండో అదనపు జడ్జి మంగాకుమారి, ఏలూరు పోక్సో కోర్టు జడ్జి సునంద, ఏలూరు ఏఎస్ కోర్టు జడ్జి విజయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వీరికి ఈఓ ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ మర్యాదలతో జడ్జిలను సత్కరించి వేద ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి ప్రసాదాలను అందజేశారు. వారి వెంట జంగారెడ్డిగూడెం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ రాజరాజేశ్వరీ, తేజస్విని పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి పుంతలోముసలమ్మ జాతర మహోత్సవాలు



పుంతలోముసలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని టూ టౌన్‌లోని సీతారాంపేట, కొబ్బరితోటలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మ తల్లి అమ్మవారిని దర్శించి తరించాలని ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు రాజా త్రినాథ భక్తులను కోరారు. 41వ వార్షికోత్సవ మహోత్సవములు వివరాలను పట్టణంలో శనివారం వెల్లడించారు. 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం అమ్మవారికి విశేష పూజలు, లలితా సహస్ర పారాయణం, మంగళవారం సహస్ర దీప లింగార్చన, బుధవారం శ్రీ లక్ష్మీ సుందర్శన హోమం, గురువారం వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణం, శుక్రవారం రథోత్సవం, 10వ తేదీ బుధవారం అఖండ అన్నసమారాధనలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

దర్శిపర్రులో పుంతలో ముసలమ్మ ఉత్సవాలు ప్రారంభం

పెంటపాడు: మండలంలోని దర్శిపర్రు గ్రామ దేవత పుంతలోముసలమ్మ ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా 5 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ఆలకరించారు.

డిగ్రీ కళాశాల సందర్శన

పెంటపాడు: పెంటపాడులోకి డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ బృందం శనివారం సందర్శించింది. కళాశాలలోని బోధన తీరు, కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో డీఆర్ గోయంకా కళాశాలకు నాక్ గుర్తింపు వస్తుందని తెలిపారు. ముగ్గురు సభ్యులు వేర్వేరుగా పరిశీలించిన రిపోర్టును ఉన్నతాధికారులకు పంపినట్లు బృందం సభ్యులు తెలిపారు.

ప్రజలందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



పీహెచ్‌సీలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం మెరుగైన వైద్యసేవలందించాలన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని పలువురు వక్తలు తెలిపారు. శనివారం ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో 14 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు ప్రాథమిక వైద్యాధికారి తోట రాజేష్, ముదునూరు వైద్యాధికారిణి పూజిత లు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం



తణుకులోని చంటిబాబును సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా పలువురు కళాకారులను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తపల్లి రామచంద్రరావు, ఈవో ముత్యాల సత్యనారాయణ, మోపిదేవి శంకర్రావు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 28 మందికి ఉద్యోగాలు

భీమవరం: స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ కళాశాలలో ఉపాధి కల్పన కార్యాలయం, నేషనల్ కేరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 28 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన శనివారం తెలిపారు. సెలక్షన్స్‌కు 55 మంది విద్యార్థులకు హాజరుకాగా బజాజ్ ఇన్సూరెన్స్ కంపెనీకి 15 మంది, ఐశ్వర్య ఫెర్టిలిటీ సెంటర్‌కు ఐదుగురు, కుశలవ హ్యుండాయ్‌కు ముగ్గురు, ముత్తూట్ ఫైనాన్స్‌కు ఐదుగురు ఎంపికయ్యారని చెప్పారు. ఈ సెలక్షన్స్‌లో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సి.భూషణ్‌రావు, కళాశాల అధ్యాపకులు ఎస్ లక్ష్మీకాంతం, అరవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల..నెరవేరిన వేళ

- జగనన్న కాలనీల్లో..జోరుగా నిర్మాణాలు
- లబ్ధిదారులకు ప్రభుత్వ తోడ్పాటు



బి.కొండేపాడులో 98 శాతం పూర్తయిన జగనన్న కాలనీ



ప్రత్తిపాడులో నిర్మాణ దశలో ఉన్న జగనన్న కాలనీ

పెంటపాడు: సొంత ఇల్లు, ప్రతి ఒక్కరికీ ఓ అందమైన కల. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో తొలిసారిగా లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన వనరులు సమకూర్చుతూ తోడ్పాటు అందిస్తున్నారు. దీని వల్ల పూరి గుడిసెలు, అద్దె ఇళ్ల నుంచి పేదలకు ఉపశమనం లభిస్తోంది. ప్రభుత్వ సహకారంతో పేదోడి సొంతింటి కల సాకారమవుతోంది. పక్కా ఇళ్ల నిర్మాణాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. పేదలకు స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం అండగా నిలవడంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. మండల పరిధిలోని ఇప్పటి వరకు 551మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేశారు. మండలంలోని 22 గ్రామాల్లో 26 లే అవుట్‌లు ఏర్పాటు చేసి వాటిలో 1400 ప్లాట్లు వేశారు. వాటిని 1,370 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇప్పటికే 382 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. 507 ఇళ్ల నిర్మాణ దశలో ఉన్నాయి. బిలో బేస్‌మెంట్ లెవిల్(బీబీఎల్) 481 ఉన్నాయి. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను సంబంధించి ప్రభుత్వం సుమారుగా రూ.14.50కోట్లు ఖర్చు చేసింది. ఇళ్ల నిర్మాణాలను గాను కేంద్ర,, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఒక్కో గృహానికి రూ.1.90లక్షలు కేటాయిస్తోంది. టీస్‌మెంట్, రూఫ్ లెవల్, శ్లాబ్ ఇలా దశల వారీగా నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తున్నారు. సొమ్ముకు అదనంగా డీఆర్‌డీఏ విభాగం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మరో రూ.35వేలు రుణంగా ప్రభుత్వం అందిస్తోంది. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర సౌకర్యాలు కల్పనకు చొరవ చూపుతోంది. ఇప్పటికే మూడు లేఅవుట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. జగనన్న కాలనీల్లో మొదటి ఫేజ్‌లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు పూర్తి చేశారు. ఫేజ్–2లో 1,154 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్న ఆదేశాలను అనుగుణంగా లబ్ధిదారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాను



సొంతిల్లు లేక ఏటికేడు పెరిగిపోతున్న అద్దెలు చెల్లించలేని పరిస్థితుల్లో జగనన్న కాలనీలో స్థలం కేటాయించడం పక్కా గృహం నిర్మించుకుంటున్నాను. సొంతింటిలో ఉండే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాను. పేదల ఇబ్బందులు తెలుసుకొని వారిని అన్ని విధాలా ఆదుకుంటున్నారు.

– గుబ్బల వెంకటలక్ష్మి, బి.కొండేపాడు, లబ్ధిదారురాలు

సొంతింటి బెంగ తీరింది



సొంత గూడు నోచుకోక, అద్దె ఇళ్లలో ఇంటి అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. జనన్న కాలనీలో ఇంటి స్థలం రావడంతో ఇల్లు నిర్మించుకుంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఎంతో మంది పేదలకు సొంతిల్లు లేదనే బెంగ తీరుతోంది

– కేదాశి వెంకటనరసమ్మ, కొండేపాడు, జగనన్న కాలనీ

జోరుగా ఇళ్ల నిర్మాణాలు



మండలంలోని 20 లే అవుట్‌ల్లో 1504 మందికి లబ్ధిదారులు ఉన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. వీటిలో 194 గృహాలు పూర్తయ్యాయి. 1,302 నిర్మాణ దశలో ఉన్నాయి. తాగునీరు, విద్యుత్, రోడ్లు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఫేజ్– 2 లేవుట్‌కి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక జరుగుతోంది.

– జి. రాజేంద్రప్రసాద్, హౌసింగ్ శాఖ ఏఈ, పెంటపాడు మండలం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా కొల్లి

తాడేపల్లిగూడెం రూరల్: ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెం గ్రామానికి చెందిన కొల్లి రాజశేఖర్ నియమితులయ్యారు. శనివారం తణుకు అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా నూతన కమిటీలను ఎనున్నకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా తనను నియమించినట్లు రాజశేఖర్ తెలిపారు. ఆయనకు పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు అభినందనలు తెలిపారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

ఆడుదాం ఆంధ్ర...ఆటలన్నీ సందడిగా...



తాడేపల్లిగూడెం అర్బన్: ఎయిర్‌ఫీల్డ్ ల్యాండ్స్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న దృశ్యం



తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



పెంటపాడు: ఎస్వీవీఎస్ స్కూల్లో ఖోఖో ఆడుతున్న యువత



పెంటపాడు: వల్లూరుపల్లిలో ఆడుదాం ఆంధ్ర క్రీడలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని ఎయిర్‌ఫీల్డ్ ల్యాండ్స్ వద్ద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శనివారం 21 నుంచి 25 వార్డుల యువత క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. పట్టణ స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే ఆడుదాం ఆంధ్ర లక్ష్యమని చిటికెన ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ ఆదేశాల మేరకు ఎంఈవో మురళీకృష్ణ, డీఈ సత్యనారాయణ అయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలను పర్యవేక్షించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు రూ.150 కోట్లు కేటాయించడం శుభపరిణామమని

ఉత్సాహంగా క్రీడా పోటీలు

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు అన్నారు. శనివారం మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, మాధవరం గ్రామాలకు చెందిన క్రీడాకారులకు ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్డు హరిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇటువంటి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. అలాగే పెదతాడేపల్లి, జగన్నాథపురం, రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలిపే గాంధీ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, సచివాలయ కార్యదర్శి ఆర్‌వీ.బ్రహ్మం, పీఈటీ అనుచూరి నాగార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు

పెంటపాడు: మండలంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఉత్సాహ భరితంగా సాగుతోంది. పెంటపాడు ఎస్వీవీఎస్ హిందూ హైస్కూల్లో షటిల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరిగాయి. దర్శిపర్రు గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించగా, వల్లూరుపల్లిలో ఖోఖో పోటీలు జరిగాయి. పెంటపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రికెట్ పోటీల్లో భాగంగా పెంటపాడు– జట్లపాలెం జట్లు ఆడాయి. రావిపాడు గ్రామంలో మహిళలు ఖోఖో పోటీలు ఉత్సాహ భరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, క్రీడల ఇన్‌చార్జ్ డి .శేఖర్, పీడీలు సత్తి కన్నారెడ్డి, ఆర్డీ కృపావరం, బి .శ్రీనివాస్, ఎస్. దిలీప్, యోహాను, వైశాలి, ఉమామహేశ్వరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తేతలిలో రీసర్వేపై గ్రామ సభ

తణుకు టౌన్: రెవెన్యూ పరిధిలోని సమస్త భూరికార్డులను రీ సర్వే చేశామని తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ అన్నారు. మండలంలోని తేతలిలో జరిగిన గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూములను సర్వే చేయడం పూర్తయిందన్నారు. సర్వే పూర్తైన సబ్ డివిజన్ జాబితాలను సభలో చదివి వినిపించారు. దీనికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. దశాబ్దాలుగా రైతులను వెంటాడుతున్న భూ సమస్యలకు భూ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వీరవల్లి లక్ష్మి, సర్వేయరు జీ శ్రీనివాసరావు, ఆర్ఐ ఐ భవానీ, వీఆర్వో జీ కళ్యాణి, గ్రామ కార్యదర్శి వీ వెంకట నారాయణ, గ్రామ సర్వేయరు బి విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న నవభారత్ సమితి సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): నవభారత్ స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా శనివారం యాగర్లపల్లి ప్రేమానంద వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మహమ్మద్ కపర్ది, కాపు యువత అధ్యక్షుడు రాపర్తి కిరణ్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాము తనిఖీ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద ఏర్పాట్లు, బందోబస్తు, వెబ్‌కాస్టింగ్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీప్యాట్లు తదితర ఎన్నికల సామగ్రిని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో పరిశీలించినట్టు చెప్పారు. ఈవీఎంల గోదాము ప్రాంగణంలో ఆర్మ్‌డ్, సాధారణ పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధుల రాకపోకల సమయంలో పోలీసులు నిర్వహించాల్సిన విధులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, ఎలక్షన్ తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, డిప్యూటీ తహసీల్దార్ ఎం సన్యాసిరావు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, కామన నాగేశ్వరరావు, మరపట్ల శ్యాంబాబు, కోమటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ సేవలను మరింత విస్తృతం చేస్తాం

తాడేపల్లిగూడెం (టీటీసీ): వాకర్స్‌చే మరిన్ని సేవలు అందిస్తామని పట్టణంలోని ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. వాకర్స్ సర్వసభ్య సమావేశం శనివారం వాకర్స్ భవనంలో అధ్యక్షుడు కేవీ చలం అధ్యక్షతన జరిగింది. ఈ నూతన సంవత్సరానికి అధ్యక్షుడిగా దూలం నాగరాజును ఎన్నిక చేశారు. అనంతరం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులు కె.అనిల్ కుమార్, యోగా గురువు చంద్రశేఖర్, ఏఆర్‌కేఎస్ మూర్తి, యోహాను, సారథిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పి.కుమారస్వామి, కోశాధికారి పీవీ పరమాత్మ, వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు



అభయ గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): మార్గశిర బహుళ చవితి సందర్భంగా శనివారం స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణయోగ ధ్యాన మందిరంలోని అభయ గణపతికి పంచామృతాలతో అభిషేకాలు, గరిక, శ్వేతార్క పుష్పాలతో సహస్ర నామార్చనలు జరిగాయి. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఇరగవరంలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇరగవరం మండలంలో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కులం, మతం చూడకుండా సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ సేవలు నేరుగా అందిస్తున్నట్లు చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకే కాక ఇతర దేశాలకు కూడా ఆదర్శప్రాయంగా నిలిచాయని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చారన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విత్తనాల దగ్గర నుంచి రైతులు పండించిన పంటలు కొనుగోలు చేసే వరకు ఆర్‌బీకేల ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణంతో ప్రతి గ్రామంలో ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో ఏ ఒక్క రోడ్డును వేయలేదని ఆరోపించారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేశారని విమర్శించారు. తణుకు నియోజకవర్గంలో ఇంత అభివృద్ధి జరుగుతున్నా తెలుగుదేశం నేతలకు కనిపించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకుల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, నాయకులు పాలా సత్యనారాయణ, కుడిపూడి సత్యనారాయణ, వీరవల్లి గణపతి, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక ఆవిష్కరణల వైపు పయనించాలి

భీమవరం: విద్యార్థులు కేవలం పుస్తకపఠనానికి మాత్రమే పరిమితంగాకుండా నూతన సాంకేతిక ఆవిష్కరణలవైపు పయనించాలని భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ అన్నారు. కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన 10వ వేలియంట్–2కే23 ముగింపు సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో ప్రతి ఏటా వేలియంట్ నిర్వస్తామన్నారు. దీనిలో దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంకేతిక ప్రతిభతోపాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేసి అలరించారు.

వాసవీ మాతకు రజత, మకర తోరణం సమర్పణ

తణుకు టౌన్: తణుకులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి తణుకు వాసవీ వైభవం క్లబ్ రూ.2.50 లక్షల విలువైన రజత మకర తోరణం, 3 గొడుగులను సమర్పించినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు గమిని రాంబాబు తెలిపారు. శనివారం ఆలయంలో తణుకు వాసవీ వైభవం క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు ఆకుల వేదకుమారి, కార్యదర్శి సుజాత, కోశాధికారి గూడూరి గీత, ఇతర సభ్యులు అమ్మవారికి పూజలు నిర్వహించి కమిటీ సభ్యులకు మకరతోరణం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి మాజేటి కాశీ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.